క్లుప్తంగా

నిరుపేదలకు అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీరామనవమి పురస్కరించుకుని గురువారం దుర్గాపురం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నిరుపేదలకు అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ మాట్లాడుతూ పండుగ పూట ప్రతి ఒక్కరి కడుపు నింపాలనే ఉద్దేశంతో టి. కోటేశ్వరరావు సహకారంతో అన్నదానం చేస్తున్నామన్నారు. ట్రస్ట్ ప్రధా కార్యదర్శి కె రాము, ఉపాధ్యక్షులు మండా రాము, కనకాల ప్రసాద్, ఎస్ రామారావు, ఫణిరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వం అండ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చేనేత కార్మికులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన వాడపల్లి త్రిమూర్తులు పార్టీ జిల్లా అధ్యక్షులు వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా త్రిమూర్తులను వెలంపల్లి సత్కరించారు. పార్టీ నాయకులు తంగెళ్ల రామచంద్రరావు, అత్తులూరి పెదబాబు, అయితా కృష్ణకిషోర్, కొల్లి మాణిక్యాలరావు, జాగు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో తామర పూలతో అర్చన




కృష్ణలంక(విజయవాడతూర్పు): శోభకృత్ నామ సంవత్సర వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా బస్టాండ్ సమీపంలోని కాశీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో గురువారం మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లకు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు 1001 తామర పూలతో విశేషంగా అర్చన నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు. ఆలయ ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్. విజయ్‌కిరణ్, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.జగదీష్, జి.పుల్లయ్య, ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు, సభ్యుడు జి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై మృతుడి అక్క ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. చిట్టినగర్ పెండెం రాములు వీధికి చెందిన గాయపోటి దుర్గా వెంకట ప్రసాద్ (40)కు వివాహం కాగా ఇద్దరు సంతానం. వెంకట ప్రసాద్ భార్యతో విభేదాల కారణంగా అమె ఇద్దరి పిల్లలతో తన పుట్టింట్లో ఉంటుంది. దీంతో భర్త ఒంటరిగా ఉంటున్నాడు. భార్య పిల్లలు తనతో లేరని అనేక సార్లు మదన పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీన వెంకట ప్రసాద్ పురుగుల మందు తాగాడు. అదే భవనంలో కింద పోర్షన్‌లో ఉండే మేనల్లుడు భవానీ ప్రసాద్ ఈ విషయం గురించి తల్లి దుర్గాదేవికి చెప్పడంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వెంకట ప్రసాద్ బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చిన్నారిపై కుక్క దాడి



పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో చిన్నారిపై కుక్క దాడి చేసింది. స్థానిక పెద్ద మసీదు షేక్ అఫ్సర్, షబనా కుమారుడు ఆసిఫ్ (2) ఇంటి వద్ద బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి ఆడుకుంటుండగా అక్కడే ఉన్న వీధి కుక్కల్లో ఒకటి వచ్చి చిన్నారి పై దాడి చేసింది. కుక్క దాడి చేసిన సమయంలో అక్కడ ఉన్న వారు చూసి బాలుడి ప్రాణాలు కాపాడారు. బాలుడిని ఆస్పత్రికి తరలించారు. కాగా తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు విపరీతంగా పెరిగాయి. రోడ్డు పై వెళ్లే వారి పై కుక్కలు దాడి చేస్తున్నాయి. స్థానికులు గతంలో కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



రామకృష్ణాపురం బుద్ధంరాజు గారి వీధిలో కల్యాణోత్సవం చేస్తున్న దృశ్యం



జీవీఆర్‌నగర్‌లో పానకం, ప్రసాదం పంపిణీ



ఊరేగింపుగా తలంబ్రాలను తీసుకెళ్తున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



ముత్యాలంపాడు కోదండ రామాలయంలో స్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు



మధురానగర్‌లో క్యూలైన్‌లో భక్తులు

కనులపండువగా సీతారాముల కల్యాణం



బీసెంట్ రోడ్డులో సీతారాముల కళ్యాణం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసెంట్ రోడ్డు రామాలయంలో 68వ సీతారాముల కల్యాణ మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకుని బీసెంట్ రోడ్డు పొడవునా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన మండపంలో స్వామి, అమ్మవారిని ఆశీనులను చేసి అర్చకులు శాస్త్రోక్తంగా కళ్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. దేవదేవుడి కల్యాణ వైభోగాన్ని కనులారా వీక్షించి భక్తజనం పులకించారు. బీసెంట్ రోడ్డులో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకలలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో భద్రాచలం తర్వాత అంతటి వైభవంగా నవమి వేడుకలు జరిగే ప్రాంతం బీసెంట్ రోడ్డు అని పేర్కొన్నారు. ఏటా అత్యంత వైభవోపేతంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తోన్న అభివృద్ధి కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు. 20 కేజీల లడ్డూను వేలం పాటలో భక్తుడు బుద్దా రంగనాథ్ రూ.25,116లకు దక్కించుకున్నారు.

బీసెంట్ రోడ్డులో వైభవంగా నవమి ఉత్సవాలు



ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో స్వామి కల్యాణోత్సవం

డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, కోఆర్డినేటర్ ఒగ్గు విక్కీ, ఉత్సవ కమిటీ సభ్యులు నీలం భానుమూర్తి, బొడ్డు శ్రీనివాసరావు, పోతిన రామ్ ప్రసాద్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీరామనవమి వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ముత్యాలంపాడు, అయోధ్య నగర్, రామలింగేశ్వరపేట, అయోధ్యనగర్, మధురానగర్, రామకృష్ణాపురం, మాచవరం, దేవీ నగర్, గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాల్లో సీతారాముల కల్యాణం కనులపండువగా జరిగింది. చలువ పందిళ్లలో వేదపండితుల మంత్రోచ్చరణలతో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు దంపతులు, ఆలయ ధర్మకర్తలు యక్కల మారుతీ, జ్యోతి, కోలాసూరాంబ దంపతులు పీటల మీద కూర్చుని పూజలు చేశారు. ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు. బావాజీపేటలో సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి పాల్గొని పూజలు చేశారు.



లడ్డూ దక్కించుకున్న భక్తుడుకి అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



బావాజీపేటలో పూజలు చేస్తున్న మల్లాది విష్ణు, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి



నందమూరినగర్‌లోని శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ



బీసెంట్‌రోడ్డులోని కల్యాణోత్సవంలో స్వామి వారికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

31వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో శ్రీరామనవమి వేడుకలలో కార్పొరేటర్ పెనుమత్స శిరీష సత్యం పాల్గొని పూజలు చేశారు. దేవీనగర్ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ గౌరవాధ్యక్షులు మాదినేని కృష్ణారావు, అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వీరరాజు, గంగిశెట్టి సాంబశివరావు, వెంకటేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు. మాచవరం డౌన్‌లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సీతారాముల కల్యాణ ఉత్సవంను బెల్లంకొండ శివాచార్యస్వామి నిర్వహించారు. ముత్యాలంపాడు కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. చుట్టుగుంట గంగానమ్మ అమ్మవారి దేవాలయంలో భక్తులకు పానకం వడపప్పులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణాపురం బుద్ధంరాజుగారి వీధిలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. గద్దే వెంకట్రామయ్య నగర్ దేవుని మండపం వద్ద శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు వడపప్పు, పానకం, పులిహోర పంపిణీ చేశారు.

ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో సీతారాముల కళ్యానోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు పొన్నలూరి లక్ష్మణరావు దంపతులు పీటల మీద కూర్చుని పూజలు చేశారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. మధురానగర్ శ్రీకళ్యాణ రామాలయంలో సీతారాముల కళ్యాణం సంప్రదాయబద్ధంగా జరిగింది. రామలింగేశ్వరపేట ఆంజనేయస్వామివారి దేవాలయం, అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి.

భక్తులకు పానకం పంపిణీ...

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీతారాముల వారి కల్యాణ మహోత్సవం సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, నందమూరి నగర్, పాయకాపురం, శాంతినగర్, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, కండ్రిక పరిసర ప్రాంతాల్లో గురువారం కనులపండువగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పుణ్యదంపతులతో సీతారాములవారి కల్యాణ వేడుకలు సందడిగా నిర్వహించారు. అనంతరం భక్తులకు, ప్రయాణికులకు పానకాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు ఇసరపు దేవి, ఉమ్మడి రమాదేవి, అలంపూరు విజయలక్ష్మీ, మోదుగుల తిరుపతమ్మ, యరగొర్ల తిరుపతమ్మలు సీతారాముల వారి కళ్యాణ మహోత్సవాలలో అతిథులుగా విచ్చేసి, ప్రత్యేక పూజలు చేశారు.

కృష్ణలంక(విజయవాడతూర్పు): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గవర్నర్‌పేటలోని బకింగ్‌హామ్ పోస్టాఫీస్ సమీపంలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు శాస్త్రోత్రంగా తలంబ్రాలను పవిత్రంగా ఊరేగింపుగా తీసుకెళ్లి రాములోరికి సమర్పించారు. కనులారా కల్యాణాన్ని తిలకించారు.

భక్తి రసభరితం రామచరిత గానం

విజయవాడ కల్చరల్: శ్రీరామనవమి సందర్భంగా ఆంధ్ర జింఖానా క్లబ్, తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ జింఖానా క్లబ్ ఆవరణలోని కళావేదికపై గురువారం నిర్వహించిన రామ చరితా గానం భక్తిగా సాగింది. చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు మల్లాది స్వాతి, కొండేటి దుర్గానాగమణి కొండలరావు, భాస్కరరావు, మోహన్‌రావు, మస్తాన్‌వలి, డేవిడ్‌రాజు తెలుగు సినిమాల్లో రామచరితను వివరించిన లవకుశ, శ్రీ రామరాజ్యం, సంపూర్ణ రామాయణం, శ్రీ రామకథ తదితర చిత్రాల్లోని పాటలతోపాటు లలిత గీతాలను ఆలపించారు. గోళ్ళ నారాయణరావు, శ్యాంప్రసాద్, చీదెళ్ళ నాగేశ్వరరావు, శింగంశెట్టి పెద బ్రహ్మం పాల్గొన్నారు. జింఖానా క్లబ్ సభ్యులు గాయనీ గాయకులను సత్కరించారు.



చిత్ర గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

శ్రీరాముడు చూపిన మార్గంలో పయనించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీరాముడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని ప్రవచనకర్త చింతావెంకట శివరామకృష్ణ కుమార్ అన్నారు. మాచవరం డౌన్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన శ్రీ రామాయణ ప్రవచనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాములు ఆదర్శ దంపతులు అని అన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినప్పటికీ వారు ధర్మమార్గంను వీడలేదని గుర్తు చేశారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీకళ్యాణ రామాలయంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. భక్తి కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను రంజింప చేశాయి. భక్తితన్మయత్వంలో ముంచెత్తాయి. అనంతరం చిన్నారుల భరత నాట్య ప్రదర్శన జరిగింది.

సీతారామ కల్యాణంలో సీపీ దంపతులు



కల్యాణం జరిపిస్తున్న సీపీ టీకే రాణా దంపతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా విజయవాడ బందర్ రోడ్‌లోని పోలీస్ క్వార్టర్స్‌లోగల సాయుధ రిజర్వ్ పోలీస్ రామాలయంలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా దంపతులు సీతారాములు కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలుకగా పోలీస్ కమిషనర్ దంపతులు సంప్రదాయ పద్ధతిలో స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహ మూర్తులకు వైభవంగా కల్యాణం చేశారు. డీసీపీలు విశాల్ గున్నీ, ఏబీటీఎస్ ఉదయరాణి, మోకా సత్తిబాబు (అడ్మిన్), కె శ్రీనివాసరావు (ట్రాఫిక్), బీ రామకృష్ణ (సీఎస్‌డబ్ల్యు), సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ సీహెచ్ లక్ష్మీపతి, క్రైమ్ ఏడీసీపీ పీ వెంకటరత్నం, ఏఆర్ ఏడీసీపీ కె శ్రీనివాసరావు, ఏసీపీలు జీవీ రమణమూర్తి, వీఎస్ వాసన్, చెంచి రెడ్డి, పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యానికి కళలు దోహదం



కార్యక్రమంలో విద్యార్థుల అభినయం

గుణదల (విజయవాడ తూర్పు): కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా లలిత కళలల్లో విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆంధ్రలయోల ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్ జేవియర్ అన్నారు. కళాశాల ఆవరణలో అభినయ – 2023 కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారత దేశ సంస్కృతి సంప్రదాయాలలో లలిత కళలకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. సామాజిక చైతన్యానికి కళలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. సంగీతం, సాహిత్యం, రచన, అభినయం వంటి అంశాల్లో విద్యార్థులు అభిరుచి కలిగి నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పొందించేందుకు తమ కళాశాల పలు కార్యక్రమాలను రూపొందిస్తుందని వివరించారు. దీనిలో భాగంగా అభినయ – 2023 కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సెల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, పర్యావరణ పరిరక్షణ, వంటి అంశాలను ముఖాభినయం ద్వారా ప్రదర్శించి చక్కని ప్రతిభ కనబరిచారని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్ర, ప్రిన్సిపల్ ఓ.మహేష్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు బియ్యం పంపిణీ



భవన నిర్మాణ కార్మికులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఏసీపీ ఖాదర్‌బాషా

ఆటోనగర్(విజయవాడతూర్పు): కనకదుర్గ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు 200 మందికి విజయవాడ సెంట్రల్ ఏసీపీ ఎస్‌కె ఖాదర్‌బాషా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ ఖాదర్‌బాషా మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. భవననిర్మాణ కార్మికులు రోజువారి పనుల నిమిత్తం బెంజిసర్కిల్ వద్ద ఉంటారని... వీరిని గుర్తించి సహాయం చేయడం మరువరానిదన్నారు. ఒక్కొక్కరికి 10 కేజీలు బియ్యం అందించామన్నారు. ఫైనాన్స్ కంపెనీ ఎండీ వీజీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరుపై హర్షం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో కాపు కల్యాణమండపం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల నిధులు మంజూరు చేయటం హర్షణీయమని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, కాపునాడు నేత నక్కా గాంధీ అన్నారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కాపు కల్యాణ మండపానికి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరైయ్యాయన్నారు. సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.25 లక్షలు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాపు సామాజికవర్గ సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అన్నివిధాలా అండగా నిలుస్తున్నారని చెప్పారు. కాగితాలపై ప్రతిపాదనలకే పరిమితమైన కాపు కల్యాణ మండపం తాజాగా నిధులు మంజూరుతో త్వరలోనే నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు.

సీఎం సహాయనిధి నుంచి రూ.2.80 లక్షలు మంజూరు



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నాయకులు

రామవరప్పాడు: కిడ్నీ సంబంధిత వ్యాధికి చికిత్స తీసుకుంటూ మృతి చెందిన ఓ పాప కుటుంబానికి సీఎం సహాయనిధి బాసటగా నిలిచింది. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు గ్రామానికి చెందిన లుక్క బైరేశ్వరరావు కుమార్తె(6) కిడ్నీ సంబంధిత వ్యాధికి చికిత్స తీసుకుంటూ ఇటీవల మృతి చెందింది. ఈ చికిత్సకు ఖర్చు చేసిన మొత్తం నగదును ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయ్యాయి. నగదును పాప తండ్రి బైరేశ్వరరావుకు గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, కోనేరు సుబ్బారావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గంగుల శ్రీనివాసరావు, రాచమళ్ల రత్నకుమారి, వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థిని ఎంపిక

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రతిష్టాత్మక నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు బాపులపాడు మండలం రంగన్నగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని గరికిపూడి తేజశ్రీ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోరిపర్తి రాణి గురువారం తెలిపారు. ఇటీవల జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం పరీక్ష -2023లో తేజశ్రీ ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు. తేజశ్రీకి ప్లస్ టూ తరగతి వరకు ఏటా రూ.12 వేలు ఉపకారవేతనం అందిస్తారన్నారు. తేజశ్రీని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో శుక్రవారం నుంచి ఏప్రిల్ ఎనిమిదో తేదీ వరకూ వసంత నవరాత్రి సహిత కల్యాణ పుష్పయాగ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.హేమలతాదేవి తెలిపారు. ఏటా చైత్రమాసంలో వసంత రుతువును పురస్కరించుకొని స్వామి వారి సన్నిధిలో వసంతనవరాత్రులను నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. స్వామివారిని పెళ్లికుమారునిగా చేయుట, విఘ్నేశ్వరపూజ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణం, సర్వదేవతల ఆహ్వానం, ఒకటో తేదీ ఉదయం సాయంత్రం నిత్య ఔపాసన, బలహరణలు, రెండున తేదీన సాయంత్రం ఎదుర్కోల ఉత్సవం, మూడున శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం, నాలుగున నిత్య ఔపాసన, బలిహరణలు, ఐదో తేదీన వసంతోత్సవం, పూర్ణాహుతి, దొంగలదోపు ఉత్సవం ధ్వజావరోహణంతదితర కార్యక్రమాలుంటాయని వివరించారు. అదేవిధంగా ఆరో తేదీన ద్వాదశ ప్రదక్షణలు, స్వామి వారి ఏకాంత సేవ, ఏడు, ఎనిమిది తేదీల్లో స్వామి వారికి ఏకాంత సేవ, ఇతర వైదిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి



పెనమలూరు: రైతులకు కేంద్ర ప్రభుత్వం తక్షణ న్యాయం చేయాలని, వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీలో జరగనున్న మజ్దూర్ కిసాన్ సంఘ యాత్ర విజయవంతం చేయాలని తాడిగడప మున్సిపాలిటీ సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను తాడిగడప మున్సిపాలిటీ సీఐటీయూ నేతలు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రిమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు సీహెచ్ రాంబాబు, పుసులూరి లక్ష్మీనారాయణ, దుమ్మాటి లక్ష్మి, సీహెచ్ భవాని, పుసులూరి పాతాళలక్ష్మి, కుప్పిలి సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.